# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 26 మే : 2024 విడుదల : 9

**"అబ్రాహాము పిలువబడినప్పుడు**

**విశ్వాసమునుబట్టి ఆ పిలుపునకు లోబడి**

**తాను స్వాస్థ్యముగా పొందనైయున్న**

**ప్రదేశమునకు బయలువెళ్ళెను"**

**- హెబ్రీ.11:8.**

# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

మే - 2024

సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.150/-


## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-4 |
| 2. | దేవుని మీద ఆనుకొనుట | 5-6 |
| 3. | ప్రార్థనయే జయము | 7-9 |
| 4. | ఐక్యత - క్షేమం | 10-12 |
| 5. | ప్రార్థన జీవితమున ఐక్యత | 13-15 |
| 6. | క్షమాపణ | 16-17 |
| 7. | ప్రార్థన ఆలకించే దేవుడు | 18-19 |


## సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥ 9.00

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

# ఎడిటర్ అర్పణ

**మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు తెలియజేయుచున్నాను.**

**"యెహోవా-నీవు లేచి నీ దేశమునుండియు నీ బంధువుల యొద్దనుండియు నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు" ఆది. 12:1-2.**

దేవుడు అబ్రాహాముతో నీ దేశమును, బంధువులను విడిచి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము, నిన్ను గొప్ప జనముగా చేసి ఆశీర్వదించెదనని చెప్పెను. పరిశుద్ధ గ్రంథమునందు అబ్రాహాము కంటే ముందుగా దేవుని వెంబడించిన ప్రార్థనాపరుడైన హెబేలు దేవునితో నడిచిన హనోకు నీతిమంతుడైన నోవహు మరెందరో పరిశుద్ధులను మనము చూస్తాము. వారు అబ్రాహాము కంటే ముందుగా దేవునితో నడిచి నీతిమంతులుగా నిలిచిరి. అయితే దేవుడు వారిలో ఎవరితోను నీ నామమును గొప్ప జేసెదను నిన్ను ఆశీర్వదించెదను అని చెప్పలేదు. అబ్రాహాముతో మాత్రమే దేవుడు ఈ నిబంధన చేసెను. కారణం దేవుడు అబ్రాహామును తన దేశమును విడచి రమ్మన్నప్పుడు ఎక్కడికి వెళ్ళవలెనో ఎరుగకయే తన జీవితమును దేవునికి సంపూర్ణముగా సమర్పించుకొనెను. అబ్రాహాము యొక్క సమర్పణ విధేయత దేవుడు తనకు వాగ్దానము చేయడానికి కారణమైనది. మనము దేవుని నమ్మి భక్తి చేయుచు ఉండవచ్చు కాని అబ్రాహాము వలె దేవునికి సంపూర్ణముగా సమర్పించుకున్నామా? అటువంటి సమర్పణతో కూడిన భక్తి దేవునికి ఎంతో ప్రీతికరమైనది.

రూతు కూడ అబ్రాహాామువలె తన స్వదేశమును స్వజనులను విడచి గొప్ప సమర్పణను కనుపరచెను. ఆమెను ప్రోత్సహించేవారు ఎవరును లేనప్పటికి ఆమె వేసిన అడుగులు గొప్ప సమర్పణతో కూడినవిగా ఉండెను. నీవు దేవుని కొరకు వేయుచున్న అడుగులు ఎంత సమర్పణతో కూడినవిగా ఉన్నవి? నీకేమి చేయాలో తెలియకపోయినను, దేవుని వాక్యమునకు లోబడి సమర్పించుకొనుము. నీ సమర్పణయే దేవుడు నిన్ను ఒక శ్రేష్టమైన ప్రగతిపథంలో నడిపించునట్లు చేయును.

దేవుడు అబ్రాహాముతో తన కుమారుడైన ఇస్సాకును బలిగా ఇవ్వమన్నప్పుడు మారు మాట్లాడకుండ దేవుడు చెప్పినది చేయుటకు సిద్ధపడెను. అబ్రాహాము తన జీవితములో తన ఇష్టమును ఎప్పుడును నెరవేర్చుకొనలేదు. దేవుని ఇష్టమును తన ఇష్టముగా చేసికొనెను. అబ్రాహాము హాగరును, ఇష్మాయేలును విడిచిపెట్టవలసినప్పుడు కూడ దేవుని మాటకు లోబడెను. దేవుడు తనను విడిచిపెట్టుమని చెప్పినవన్నియు అబ్రాహాము విడిచిపెట్టెను. నీ జీవితములో దేవుడు విడిచిపెట్టమని చెప్పిన నీ కోపాన్ని, పాపాన్ని, సోమరితనాన్ని, జారత్వాన్ని నీవు విడిచిపెట్టావా? లేక నీ ఇష్ట ప్రకారము జరిగించుచున్నావా? ఒకవేళ నీవు దేవుని వాక్యమునకు లోబడకపోయినట్లయితే దేవుడు తాను ఆశించిన ఆశీర్వాదమును నికివ్వలేరు. భూసంబంధముగా ఆశీర్వదింపబడవచ్చు గాని పరసంబంధమైన ఆశీర్వాదమును నీవు చూడలేవు. అబ్రాహాము హాగరును విడిచిపెట్టినప్పుడు ఆహారమును నీళ్ళ తిత్తిని తప్ప మరి ఏమియు ఇవ్వలేదు. తరువాత కూడా వారి యోగక్షేమముల కొరకు విచారించలేదు. అబ్రాహాము బాహ్యముగాను అంతరంగికముగాను ఒకే రీతిగా ఉన్నాడు. దాపరికమైన జీవితము అతనిలో లేదు. ఒకవేళ ఉన్నట్లయితే రహస్యముగా హాగరుకు కానుకలు పంపియుండేవాడు. కాని ఆలాగున చేయక యథార్థముగా జీవించి, దేవుని యెదుట నమ్మకమైన భక్తిని కనుపరచి సకల జనులకు దీవెనకరముగా ఉండెను. నీ జీవితములో నీవు యథార్థముగా ఉన్నట్లయితే ఎంతో మందికి దీవెనకరముగా ఉండగలవు.

దేవుడు హోరేబు కొండ మీద మోషేకు ప్రత్యక్షమైనప్పుడు నేను అబ్రాహాము దేవుడను అని చెప్పెను. మరియు క్రొత్త నిబంధన అబ్రాహాము యొక్క పేరుతో ప్రారంభము కావడము మనము చూస్తాము. వీటినిబట్టి దేవుడు అబ్రాహామును ఎంతగా దీవించెనో, ఎవరికి ఇవ్వని ప్రాధాన్యతను వాగ్దానములను అతనికిచ్చెనో పరిశుద్ధ గ్రంథమునందు మనము చూడగలము.

ప్రియమైన దేవుని బిడ్డలారా! అబ్రాహాము మూలముగా ఈ భూలోకములో ఉన్న వంశములన్నియు ఆశీర్వదింపబడునట్లుగా తాను జీవించెను. కాబట్టి దేవునియొక్క పరసంబంధమైన ఆశీర్వాదము పొందుకొనునట్లుగా అబ్రాహామువలె మనము సంపూర్ణమైన సమర్పణతో కూడిన భక్తి చేసి, యథార్థముగా దేవుని ఇష్టమునకు మనలను మనము అప్పగించుకొని ఈ తరమునకు దీవెనకరముగా ఉందాము. అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకు దయచేయును గాక!

**-ఎడిటర్**

## దేవుని మీద అనుకొనుట

**అలసినవానికి నెమ్మది కలుగజేయుడి, ఇదే నెమ్మది ఇదే విశ్రాంతి**

యెషయా 28:11,12

ఎందుకు ఆందోళన చెందుతావు? నీవు చింతించడంవల్ల ప్రయోజనమేమిటి? నీవు ఒక ఓడలో ప్రయాణం చేస్తున్నావు. ఓడ కెప్టెన్ నీకు అధికారం ఇచ్చినా ఆ ఓడను నడిపే శక్తి నీకు లేదు. కనీసం తెరచాపను కూడ పైకెత్తలేవు. అయినా నీవు చింతిస్తూనే ఉన్నావు. ఓడ నడిపే వాడివి నీవు కాదు కదా! నెమ్మదిగా ఉండు. దేవుడే యజమాని.

నీ చుట్టూ కనిపిస్తున్న అవాంతరాలు, అడ్డంకులు చూసి దేవుడు తన సింహాసనము మీద లేడని అనుకుంటున్నావా?

ఎంతమాత్రం కాదు. ఆయన యుద్ధాశ్వాలు వాయువేగంతో దౌడుతీస్తున్నాయి. పెనుగాలి తుఫానులా ఆయన రథం వస్తున్నది. అయితే గుర్రాల కళ్ళేలు ఆయన చేతిలో ఉన్నాయి. తన ఇష్టప్రకారం వాటిని పరుగెత్తిస్తాడు. యెహోవాయే సైన్యములకధిపతి. నమ్మికయుంచి మనస్సుని కుదుటపర్చుకో, భయపడకు.

**ఈ రేయి నా అంతరంగమా హాయిగా నిదురపో**
**చెలరేగే పెనుతుఫానుకి ఎదుర్తై నిలిచింది దేవుడే**
**దేవుడే, నీవు కాదు హాయిగా నిదురపో ఈ రేయి**

**ఈ రేయి నా అంతరంగమా హాయిగా నిదురపో**
**విర్రవీగే సైతాను దాడుల్ని తిప్పికొట్టేది దేవుడే**
**దేవుడే నీవు కాదు హాయిగా నిదురపో ఈ రేయి**

**ఈ రేయి నా అంతరంగమా హాయిగా నిదురపో**
**వీచే పిల్లగాలిలో కలిసి వీచేది దేవుని ప్రేమే**
**దేవుని ప్రేమే హాయిగా నిదురపో ఈ రేయి**

**ఈ రేయి నా అంతరంగమా హాయిగా నిదురపో**
**అంగలార్చేవాళ్లని ఓదార్చేది దేవుని రాజ్యమే**
**దేవుని రాజ్యమే నీది కాదు హాయిగా నిదురపో**

నేను నిన్ను బ్రతిమాలుతున్నాను, నిస్పృహకి తావివ్వకు. ఇది చాలా ప్రమాదకరమైన శోధన. శత్రువు పన్నే కుటిలమైన పన్నాగం, దుఃఖం అనేది హృదయాన్ని కుదించి ఎండిపోయేలా చేస్తుంది. ఆపైన దానిపై ఎంత కృప వరించినా ఫలితం ఉండదు. దుఃఖం అనేది చిన్న విషయాలను కూడా పెద్దవి చేసి భయంకరమైన రంగుల్లో చూపిస్తుంది. నీకున్న తేలికభారం ఎక్కువ బరువుగా అనిపించేలా చేస్తుంది. నీ గురించి దేవుని పథకాలు, వాటిని ఆచరణలో పెట్టడానికి ఆయన అనుసరించే మార్గాలు జ్ఞానంతో నిండినవి.

# ప్రార్థనయే జయము

**"ఇట్టి శాసనము సంతకము చేయబడెనని దానియేలు తెలిసికొనినను అతడు తన యింటికి వెళ్లి, యథాప్రకారముగా అనుదినము ముమ్మారు మోకాళ్లూని, తన యింటి పైగది కిటికీలు యెరూషలేము తట్టునకు తెరువబడియుండగా తన దేవునికి ప్రార్థనచేయుచు ఆయనను స్తుతించుచువచ్చెను. ఆ మనుష్యులు గుంపుకూడి వచ్చి దానియేలు తన దేవునికి ప్రార్థనచేయుటయు ఆయనను బతిమాలుకొనుటయు చూచి రాజు సముఖమునకు వచ్చి శాసనవిషయమును బట్టి రాజా, ముప్పది దినముల వరకు నీకు తప్ప మరి ఏ దేవునికైనను మానవునికైనను ఎవడును ప్రార్థన చేయకూడదు; ఎవడైన చేసినయెడల వాడు సింహముల గుహలో పడద్రోయబడునని నీవు ఆజ్ఞ ఇయ్యలేదా? అని మనవి చేయగా రాజు మాదీయులయొక్కయు పారసీకుల యొక్కయు పద్ధతిప్రకారము ఆ సంగతి స్థిరము; ఎవరును దాని రద్దుపరచజాలరనెను" దానియేలు 6:10-12.**

బబులోను సామ్రాజ్యములో బానిసగా ఉన్న దానియేలును దేవుడు ఎంతో హెచ్చించెను. దానియేలు యొక్క ప్రార్థనాజీవితము పరిశుద్ధత కొరకైన తీర్మానాలు అతనిని ఉన్నతమైన స్థానమునకు తీసుకొని వెళ్ళెను. దానియేలు గొప్ప ప్రార్థనాపరుడు. అనుదినము ముమ్మారు మోకాళ్లూని ఇంటి పైగది కిటికీలు యెరూషలేము తట్టు తెరిచి ప్రార్థన చేయువాడు.

ఆ దేశమునందు కొందరు మనుష్యులు దానియేలు ఉన్నతమైన స్థితిలో ఉండుట చూచి అతని మీద అసూయపడిరి. ఏ విధము చేతనైనను దానియేలును నశింపజేయవలెనని అనుకొనిరి. అతనిలో తప్పు పట్టుకొనవలెనని వారు ఎంతో వెదకిరి కాని దానియేలులో ఏ తప్పైనను లోపమైనను కనబడలేదు. **"అందుకా మనుష్యులు- అతని దేవుని పద్ధతి విషయమందేగాని మరి ఏ విషయమందును అతనిలో లోపము కనుగొన**

**లేమనుకొనిరి" దానియేలు 6:5.** అందునుబట్టి వారు ముప్పది దినముల వరకు రాజునకు తప్ప మరి ఏ దేవునికైనను మానవునికైనను ఎవడును ప్రార్థన చేయకూడదని శాసనము పుట్టించెను. రాజు దానికి అమోద ముద్ర వేసెను. మాదీయులు, పారసీకుల పద్ధతి ననుసరించి రాజు ఒక నిర్ణయము చేసిన తరువాత దానిని ఎవరును రద్దు చేయలేరు. ఎవరైనను ఆ శాసనమునకు వ్యతిరేకముగా ఉండిన యెడల అతడు సింహముల బోనులో పడద్రోయబడునని రాజు ఆజ్ఞ ఇచ్చెను. ఇట్టి శాసనము సంతకము చేయుబడెనని దానియేలు తెలుసుకొనినను తన ఇంటికి వెళ్ళి యథాప్రకారముగా అనుదినము ముమ్మారు మోకాళ్ళూను దేవునికి ప్రార్థన చేసెను. దానియేలు యొక్క ప్రార్థన జీవితమును ఏ శాసనములు ఆపలేకపోయెను. అపవాది దానియేలు యొక్క భక్తి జీవితమును నాశనము చేయాలని అధికారుల యొక్క హృదయములో ప్రవేశించెను.

"నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" 1పేతురు 5:8. అపవాది ఎవనిని మ్రింగుదునా అని గర్జించు సింహమువలె వెదకుచు తిరుగుచున్నాడు. వాడు ఆత్మీయ జీవితములో విశ్వాసమును, ప్రార్థనను, పరిశుద్ధతను బద్దలు చేయాలని ఎల్లప్పుడు పొంచి ఉంటాడు. మనము ప్రార్థన కొరకు చేసే తీర్మానాలు విశ్వాస జీవితములో కలిగి ఉండే ప్రమాణాలు, పరిశుద్ధత కొరకైన ఆశలు దేవుని ప్రేమించి ఆయన ఆజ్ఞలు గైకొనే విషయములను ఎప్పుడును నిర్లక్ష్యము చేయకూడదు. ఇంత మరణకరమైన శాసనము దానియేలు యెదుట కనబడుచున్నప్పటికి బెదరలేదు, జడియలేదు. విశ్వాసమునందు ప్రార్థనలో పట్టువిడువక యుండెను. మనకు కలిగిన పరిస్థితులు మన ఆత్మీయ జీవితమును ప్రభావితము చేయకూడదు. ప్రార్థన చేయకూడదనే శాసనము పుట్టకముందు దానియేలు ప్రార్థన చేశాడు. శాసనము పుట్టిన తరువాత

కూడా ప్రార్థన చేసెను. మన దేశములో మనకు ఇటువంటి కఠినమైన పరిస్థితులు లేవు. ఒకవేళ అటువంటి పరిస్థితులు సంభవించినట్లయితే దానియేలు వలె ప్రార్థన జీవితమును కాపాడుకొనుటకు జాగ్రత్తపడవలెను.

ప్రియమైన దేవుని బిడ్డలారా! దానియేలువలె మనము కూడ పరిశుద్ధ జీవితమును, ప్రార్థన జీవితమును కలిగియుండాలి. కఠినమైన పరిస్థితులలో కూడ దేవునితో సహవాసమును కాపాడుకొనవలెను. దుష్టుడైన అపవాది యొక్క అగ్ని బాణములను ఆర్పివేసే వారిగా, దేవునికి విరోధముగా లేచే శత్రు తంత్రాలను నిర్వీర్యం చేసే క్రీస్తు యోధులముగా ప్రార్థనను కొనసాగించుదాము. ఎటువంటి పరిస్థితి కూడ మన భక్తి జీవితమును తాకలేని స్థిరమైన నిర్ణయములో కొనసాగుదాము. దానియేలు తాను ఆరాధించే దేవుడు ఏమైయున్నాడో అన్యజనులకు తన జీవితము ద్వారా చూపెను. ఈ తరమునకు మన దేవుని యొక్క గొప్పతనమును మహిమను మన జీవితముల ద్వారా చూపునట్లుగా పరిశుద్ధాత్మ దేవుడు మనకు దయచేయును గాక.

**నీవు బొగ్గులాగా ఉంటే**
**చీమలు కూడా నీ మీద నుండి**
**నడుచుకొంటూ వెళ్ళిపోతాయి.**
**నీవు ప్రార్థన అనే కొలిమిలో**
**నిప్పులాగా మారు**
**నిన్ను ముట్టుకోవడానికి**
**సింహాలు కూడా భయపడతాయి.**

# ఐక్యత - క్షేమం

**"ఇదియుగాక నాకు సహాయము చేయు దేవుని కరుణాహస్తమును గూర్చియు, రాజు నాకు సెలవిచ్చిన మాటలన్నియు నేను వారితో చెప్పితిని. అందుకు వారు మనము కట్టుటకు పూనుకొందుము రండని చెప్పి యీ మంచికార్యము చేయుటకై బలము తెచ్చుకొనిరి" నెహెమ్యా 2:18.**

నెహెమ్యా పడిపోయిన యెరూషలేము ప్రాకారములు కట్టబోయే ముందు తన ప్రజలతో చెప్పిన మాటను ధ్యానించుదుము.

దేవుని కరుణాహస్తము నెహెమ్యాతో ఉండుట వలన నెహెమ్యా గొప్ప జయమును చూడగలిగెను. నెహెమ్యా గ్రంథము మొదటి అధ్యాయములో యూదులను గురించి వారికి కలిగిన శ్రమలను గూర్చిన వర్తమానము తన సహోదరులు తెలిపెను. దానిని నెహెమ్యా హృదయపూర్వకముగా గ్రహించెను గనుక తన హృదయము దుఃఖముతో నిండిపోయెను. ఆ వర్తమానము నెహెమ్యాను కొన్ని దినములు కూర్చొని ప్రార్థన చేయుటకు సహాయపడినది. దేవుని సన్నిధిలో నెహెమ్యా తన పాపమును తన పితరుల పాపమును ఒప్పుకొనెను. ప్రార్థించుట ముగించిన తరువాత నెహెమ్యా ఎప్పటివలె రాజునకు గిన్నెను అందించు ఉద్యోగములో కొనసాగుచుండెను. తమ సహోదరులు తెచ్చిన సమాచారమును, యూదులు అనుభవించుచున్న శ్రమలను గూర్చిన విషయమును నెహెమ్యా రాజునకు తెలియపరచలేదు. నెహెమ్యా తన హృదయములో ఉన్న భారమంతయు దేవుని పాదముల చెంతకు తీసుకొని వెళ్ళెను. అంతకు ముందెన్నడు నెహెమ్యా రాజునకు గిన్నె అందించే సమయములో విచారమును దుఃఖమును కనుపరచలేదు. రాజు నెహెమ్యా ముఖమును చూచి నీకు వ్యాధి లేదు గదా ఎందుకు దుఃఖముతో ఉన్నావు? అని అడిగెను.

నెహెమ్యా హృదయములో యెరూషలేములో పడిపోయిన ప్రాకారముల కొరకైన భారమును బట్టి దేవుడు రాజు హృదయమును కదిలించి నెహెమ్యాతో మాట్లాడునట్లుగా చేసెను. అప్పుడు నెహెమ్యా రాజునకు యెరూషలేమును గూర్చిన సంగతిని తెలియపరచినప్పుడు దేవుడు నెహెమ్యాకు తోడుగా ఉండుటను బట్టి రాజు తన మనవిని అంగీకరించెను. అప్పుడు నెహెమ్యా రాజు సెలవు పొంది యెరూషలేమునకు వెళ్లెను. నెహెమ్యా యెరూషలేముకు వచ్చిన తరువాత అక్కడ ఉన్నటువంటి తన సహోదరులను కలిసెను. అక్కడ నెహెమ్యా వారితో మనకు కలిగిన శ్రమ మీకు తెలిసియున్నది, యెరూషలేము ఎట్లు పాడైపోయెనో దాని గుమ్మములు అగ్నిచేత ఎట్లు కాల్చబడెనో మీరు చూచియున్నారు, మనకు ఇకమీదట నింద రాకుండ యెరూషలేముయొక్క ప్రాకారమును మరల కట్టుదము రండని చెప్పెను. యెరూషలేము యొక్క దుస్థితిని వారికి జ్ఞాపకము చేసి తిరిగి దానిని బాగుచేయుటకు వారిని రేపెను.

నెహెమ్యా తన తోటి సహోదరులను తన సొంత సహోదరులవలె భావించి కలుపుకొని పనిచేసెను. యెరూషలేము ప్రాకారములను తిరిగి కట్టుట ప్రారంభించినప్పుడు ఎన్నో ఆటంకములు, శత్రువుల కుట్రలు వారికి ఎదురయ్యెను. అయినను వారు దేవుని సహాయముతో ప్రార్థన ద్వారా ఐక్యత కలిగి కొద్ది దినములలోనే యెరూషలేము ప్రాకారములు కట్టి ముగించిరి. మన యొద్దకు సమాచారము తెచ్చిన సహోదరులను సొంత సహోదరుల వలె భావించగలిగితే హృదయమంతటితో తీసుకొని పనిచేయగలము. తద్వారా దేవుని సంకల్పము నెరవేర్చబడును.

మనము దేవుని ప్రేమతో నింపబడిన వారమై దేవుడు మనకిచ్చిన సహోదరులను ప్రేమించి వారి మాట విని, వారితో ఐక్యత కలిగి ప్రార్థనాపూర్వకముగా పనిచేసినప్పుడు ఎన్నో కార్యములను ప్రభువు పేరట చేయగలము. దేవుని బిడ్డల మాటను నమ్మడం, లోబడడం దేవుడు చేయబోయే

కార్యములకు పునాదివంటిది. అది క్షేమకరమైనది. నెహెమ్యా దేవుని ప్రజల విషయములో వాక్యనుసారముగా జీవించాడు కాబట్టి యెరూషలేముకు క్షేమమును అందించిన వ్యక్తిగా చరిత్రలో నిలిచెను.

**"మరియు ఆసియ దేశాధికారులలో కొందరు అతనికి స్నేహితులైయుండి అతనియొద్దకు వర్తమానము పంపి- నీవు నాటకశాలలోనికి వెళ్లవద్దని అతని వేడుకొనిరి"** అపొ. 19:31. పౌలుయొక్క స్నేహితులు నీవు నాటకశాలలోనికి వెళ్ళవద్దని అతనికి వర్తమానమును పంపెను. ఆ వర్తమానము పౌలు తీసుకొని వారి మాటను గౌరవించి లోబడుట వలన పౌలు దేవుని చిత్తమును సంపూర్ణముగా చేయగలిగెను.

సౌలు, దావీదును హతము చేయవలెనన్న తలంపు కలిగి ఉన్నప్పుడు సౌలు కుమారుడైన యోనాతాను దావీదును పొలములో దాగి ఉండమని చెప్పెను. దావీదు ఆ మాటను హృదయమంతటితో తీసుకొనెను. అదే విధంగా పొలములో నుండి బయటకు రమ్మని పిలిచినప్పుడు బయటకు వచ్చి ఎంతో క్షేమమును చూడగలిగెను. దేవుని కృపనుబట్టి సౌలు యీటె నుండి దావీదు తప్పించుకొనగలిగెను.

ప్రియులారా! చివరి దినములలో మనము ఉన్నాము. మనము ఎవరిని ప్రేమించాలో వారిని ప్రేమించకుండ చేయుటయే అపవాది యొక్క ఉద్దేశము. దేవుని చిత్తానుసారమైన భారము మనలో ఉండకుండ, మన మాటలు కూడా దైవికముగా ఉండకుండ చేయును. తద్వారా దైవచిత్తానుసారమైన మార్గములలో మనము నడవలేము. నెహెమ్యావలె పౌలువలె దావీదువలె మనము కూడ తగ్గింపు కలిగి దేవుని బిడ్డల మాటకు విలువనిచ్చి వారితో కలిసి పనిచేసి మనము క్షేమమును అనుభవిస్తూ మన తోటి ప్రజలకు క్షేమమును అందించువారిగా మారుదాము.

# ప్రార్థన జీవితమున ఐక్యత

యాజకులమైన మనము ఈ భూమిపై నున్నాము. మన ప్రధాన యాజకుడు తండ్రి కుడిపార్శ్వమున కూర్చుండి యున్నాడు. దైవాత్మతో విజ్ఞాపన చేయుచున్నాడు. మనము మన ఉనికి ఆయనలో కలిగి యున్నందున ఆయనలోని ఆత్మయే మనలో ఉండి మన పక్షముగా విజ్ఞాపన చేయుచున్నాడు. **"అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్ఛరింప శక్యముకాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు"** రోమా 8:26. అందుచేత మన ప్రార్థన ప్రధాన యాజకుని ప్రార్థనతో ఐక్యపరచబడుచున్నది. ఫలించు ప్రార్థనా జీవితము లభించుచున్నది. ఇదియే ఫలించు ప్రార్థనా జీవితము యొక్క రహస్యము.

**"ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాధులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహముతోను పోరాడుచున్నాము"** ఎఫెసి. 6:12. శరీరరీతిగా మనము ఈ ప్రపంచమున నున్నాము. మన విరోధియైన అపవాదియు వాని అనుచరులును మనకు పైగా వాయుమండల లోకమున ఉన్నారు. మన విరోధి మనకంటే ఉన్నతమెట్టులో యున్నాడు. గాని మన సంరక్షణకర్త సాతానుకంటే ఉన్నత స్థితిలో తండ్రి కుడిపార్శ్వమున యున్నాడు. **"ఎవడైనను తనకు హాని చేసెనని యొకడనుకొనిన యెడల ఒకని నొకడు సహించుచు ఒకనినొకడు క్షమించుడి, ప్రభువు మిమ్మును క్షమించినలాగున మీరును క్షమించుడి"** కొలస్సి. 3:13. అందువలన మనలను శత్రు సమూహము ఎదుర్కొనక పూర్వము అపవాది ప్రధాన యాజకుని జయించవలెను. అయితే క్రీస్తు యేసు ముందుగానే సిలువలో సాతానును జయించినందున క్రీస్తు విజయము

మన విజయమాయెను. **"సమాధాన కర్తయగు దేవుడు సాతానును మీ కాళ్ళక్రింద శీఘ్రముగా చితుక త్రొక్కించును"** రోమా 16:20 అను దేవుని వాగ్దానము నెరవేరినది.

ఔన్నత్య జీవితమునకై ఇప్పుడు అభిలషించుదుము. పరిశుద్ధాత్ముడు కొలస్సిలోనున్న సంఘమునకిచ్చిన గొప్ప హెచ్చరికను గుర్తించుము. 'మీరు క్రీస్తుతో కూడ లేపబడినవారైతే పైనున్నవాటిని వెదకుడి. అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు. పైనున్న వాటిమీదనేగాని భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టకుడి' అని వ్రాయబడియున్నది.

అనగా మీరు మృతినొందితిరి. మీ జీవము క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడియున్నది. అప్పుడు దాని ఫలితములను మనము గుర్తించగలము. అవేవనగా **"మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీరును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్షపరచబడుదురు"** కొలస్సి. 3:4. నీ జీవితమును నిమిష నిమిషమునకు పరీక్షించుకొనుము. నీవు మనస్కరించుచున్నది పైనున్నవాటినా? లేక భూసంబంధమైనవాటినా? పరలోకవాసులు భూమిపై అనేకవాటిని కలిగియుండలేరు. అయితే ఏవేవి ప్రభువు మహిమార్థమై ఎచ్చట పోగొట్టుకొంటిమో వాటికంటే ఉత్తమమైనవి మనము ఆత్మీయముగా కలిగియుండగలము. ఔన్నత్య స్థితిలో పరి.పౌలు అనుభవము నొకసారి గుర్తించుము. **"కావున మేము అధైర్యపడము. మా బాహ్యపురుషుడు కృశించుచున్నను ఆంతర్యపురుషుడు దినదినము నూతనపరచబడుచున్నాడు"** 2కొరింథి. 4:16.

మరియొక అనుభవము మేము దృశ్యమైనవాటిని చూడక అదృశ్యమైన వాటినే నిదానించి చూచుచున్నాము గనుక క్షణమాత్రముండు మా చులకని శ్రమ మా కొరకు అంతకంతకు ఎక్కువ నిత్యమైన మహిమ భారమును కలుగజేయుచున్నది. "ఏలయనగా దృశ్యమైనవి అనిత్యములు. అదృశ్యమైనవి నిత్యములు" 2 కొరింథి. 4:17-18. ఔన్నత్యస్థితియందు

ఉండునట్లు చూడగోరిన ప్రకారము మనము చూడనివాని నమ్మి నడుచుకొనవలయును. ఉన్నత మహిమ దర్శించిన వాడు భూసంబంధమైన వాటియందు తిరిగి చూడడు. స్వచిత్తమును పూర్తిగా రూపుమాపి దేవుని చిత్తమునకు లోబడుచుండును. నిరీక్షించిన క్రీస్తు నాధుని కొరకు వీక్షించుము. రక్షకుని రాకకొరకు కనిపెట్టుకొని యుండుము. ఫిలిప్పీ3:20. ఎడతెగక ప్రతి అవస్తలోను ఆయున జీవితమందు నిదానించి చూచుచుండుము. ఆ రీతిగా సాగిపొమ్ము.

పరి. పౌలు ఫిలిప్పి సంఘస్తుల యెదుట ఔన్నత్య జీవితమును గూర్చిన గురినే ఉంచియున్నాడు. మరియు మీ మనోనేత్రములు వెలిగింపబడినందున ఆయన మిమ్మును పిలిచిన పిలుపువల్లనైన నిరీక్షణ యెట్టిదో, పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యముయొక్క మహిమైశ్వర్యమెట్టిదో ఆయన క్రీస్తునందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి విశ్వసించు మనయందు ఆయున చూపుచున్న తన శక్తియొక్క అపరిమితమైన మహత్మ్యమెట్టిదో మీరు తెలిసికొనవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క దేవుడైన మహిమాస్వరూపియగు తండ్రి తన్ను తెలుసుకొనుటయందు మీకు జ్ఞానమును ప్రత్యక్షతయునుగల మనస్సు అనుగ్రహించునట్లు నేను నా ప్రార్ధనలయందు మిమ్మునుగూర్చి విజ్ఞాపన చేయుచున్నాను'' ఎఫెసి. 1:17-19.

పేతురు అనుభవమును అట్లేయున్నది. "బయలుపరచబడబోవు మహిమలో పాలివాడనైన నేను" అనుచున్నాడు. తన నిత్యమహిమకు క్రీస్తునందు మిమ్మును పిలిచిన సర్వకృపానిధియగు దేవునియొక్క అనుభవములోనికి మనమును సాగిపోవుదము. ఔన్నత్యమునకు హెచ్చింపబడిన మన ప్రియ క్రీస్తునాధుని ముఖమును నిదానించి చూతము. ఆయనే మన నిరీక్షణకు మహిమకు ఆధారము, మనకు జీవము. ఆయనను స్తుతించుచు ఆయన ఔన్నత్యమున పాలుపంపు కలిగియుందుము.

# క్షమాపణ

**నీవు న్యాయాధిపతికి అప్పగింపబడి అన్యుని వలన తీర్పు తీర్చబడకుండునట్లును, శిక్షింపబడకుండునట్లును నీ సహోదరునితో సమాధానపడుము; అతని క్షమించుము.**

"నీ ప్రతివాదితో నీవును త్రోవలో ఉండగానే త్వరగా వానితో సమాధానపడుము లేనియెడల ఒకవేళ నీ ప్రతివాది నిన్ను న్యాయాధిపతికి అప్పగించును, న్యాయాధిపతి నిన్ను బంట్రౌతుకు అప్పగించును, అంతట నీవు చెరసాలలో వేయబడుదువు. కడపటి కాసు చెల్లించువరకు అక్కడ నుండి నీవు వెలుపలికి రానేరవని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" మత్తయి 5:25-26.

**ఆదర్శప్రాయుడైన ఒక మిషనెరీ :** భారతదేశమున ఘనమైన సేవ చేసిన ఒక మిషనెరీ కలడు. ఆయన యొద్దనున్న సువార్తికుడు అవిధేయుడై పనిచేయనందున, అతని శిక్షింపనెంచి మిషనెరి ఆరు నెలలు జీతము నివ్వక ఆపు చేసిరి. ఆ సువార్తికుడు మిషనెరిపై కేసుపెట్టి న్యాయాస్థానము ఎక్కెను. మిషనెరి న్యాయాధిపతి ఎదుట నిలువబడవలసి ఉండెను. అయితే అన్యుడైన న్యాయాధిపతిచే తీర్పుపొంద నిష్టపడకుండెను.

మెజిస్ట్రేటు మిషనెరిని చూచి "అయ్యా! మీరు ఆరు నెలల జీతమును ఈ సువార్తికునికి ఇయ్యవలసి ఉన్నదా?" అని ప్రశ్నించెను. అంతట మిషనెరి వారికిట్లు జవాబిచ్చెను. "అవును, ఇవ్వవలసి ఉన్నది ఇచ్చి వేయుదును" ఈ జవాబు విని మెజిస్ట్రేటు ఆ కేసును తీర్పు తీర్చకుండగనే ముగించివేశాడు. సహోదరుడా అన్యునిచే విమర్శింపబడకుండునట్లు నీ సహోదరుని క్షమించుము. కొంత ద్రవ్యము నష్టమైనను ఫర్వాలేదు, క్షమించుము. నీ దేవునికి మహిమ తెచ్చినవాడవవుదువు. దేవుని డబ్బును

దేవుని మహిమార్థమై వాడక కోర్టులలో వాద ప్రతివాదనలకై ఖర్చు పెట్టుట ఎంత దుఃఖకరము! క్షమాపణ స్వభావము నీ జీవితమందున్న యెడల నీవు కోర్టులకు వెళ్ళగలవా? ఈ విషయమును గూర్చి దైవ వాక్యమేమి చెప్పుచున్నదో పరిశీలించితివా? "మీలో ఒకనికి మరియొకని మీద వ్యాజ్యమున్నప్పుడు వాడు పరిశుద్ధులయెదుట కాక అనీతిమంతులయెదుట వ్యాజ్యమాడుటకు తెగించుచున్నాడా?

పరిశుద్ధులు లోకమునకు తీర్పు తీర్చుదురని మీరెరుగరా? మీవలన లోకమునకు తీర్పు జరుగవలసియుండగా మిక్కిలి అల్పమైన సంగతులనుగూర్చి తీర్పు తీర్చుటకు మీకు యోగ్యత లేదా? మనము దేవదూతలకు తీర్పు తీర్చుదుమని యెరుగరా? ఈ జీవనసంబంధమైన సంగతులను గూర్చి మరి ముఖ్యముగా తీర్పు తీర్చవచ్చును కదా? కాబట్టి ఈ జీవన సంబంధమైన వ్యాజ్యములు మీకు కలిగిన యెడల వాటిని తీర్చుటకు సంఘములో తృణీకరింపబడినవారిని కూర్చుండబెట్టుదురా?

మీకు సిగ్గు రావలెనని చెప్పుచున్నాను ఏమి? తన సహోదరుల మధ్యను వ్యాజ్యము తీర్చగల బుద్ధిమంతుడు మీలో ఒకడైనను లేడా? అయితే సహోదరుడు సహోదరునిమీద వ్యాజ్యమాడుచున్నాడు, మరి అవిశ్వాసుల యెదుటనే వ్యాజ్యమాడుచున్నాడు. ఒకనిమీద ఒకడు వ్యాజ్యమాడుట మీలో ఇప్పటికే కేవలము లోపము. అంతకంటే అన్యాయము సహించుట మేలు కాదా? దానికంటే మీ సొత్తుల నపహరింపబడనిచ్చుట మేలు కాదా? అయితే మీరే అన్యాయము చేయుచున్నారు, అపహరించుచున్నారు. మీ సహోదరులకే యీలాగు చేయుచున్నారు. అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా?" 1 కొరింథి. 6:1-9.

# ప్రార్థన ఆలకించే దేవుడు

కొంతమంది మొరేవియన్ మిషనెరీలు లండన్ నుండి సెంట్ థామస్ అనే ద్వీపానికి బ్రిటానియా అనే ఓడలో ప్రయాణిస్తూ ఉండినారు. ఓడ నడిసముద్రములో నుండగా ఆకస్మాత్తుగా ఆ ఓడ మీద తుపాకీ గుండ్ల వర్షం కుమ్మరించబడింది. బ్రిటానియాను అతివేగవంతముగా నడిపించినప్పటికి ఆ దాడినుండి తప్పించుకోలేకపోయారు. సముద్రపు దొంగల ఓడ బ్రిటానియాకు సమీపముగా వచ్చేసింది. దొంగల దగ్గర పొడవాటి త్రాళ్లు, వాటి కొనలలో బలమైన హుక్కులు, ఉన్నందువలన వాటిని బ్రిటానియా మీదికి విసిరి,దానిని నిలిపివేసి దానిమీదికి ఎక్కి సామాగ్రిని దోచుకోవడానికి సిద్దంగా నున్నారు. ఓడ కెప్టెన్ వారిని చూచి భయభ్రాంతుడైనాడు. కాని ఆ ఓడ అడుగుభాగములో బలమైన విజ్ఞాపన చేయుచున్న మిషనెరీల ప్రార్థన శక్తిని ఆయన గుర్తించలేకపోయాడు.

సరిగ్గా దొంగలు వారి హుక్కులను విసరాలనుకున్నప్పుడే వారి స్వంత ఓడ అటూ ఇటూ ఊగిపోవడం త్రాళ్లను విసరాలనుకున్నవారు సముద్రంలో పడి చనిపోవడం వెనువెంటనే జరిగిపోయాయి. దొంగల ఓడ యొక్క కెప్టెన్ ఇంకొంతమందిని త్రాళ్లు విసరడానికి పంపించాడు. కాని వారికి కూడ అదే గతి పట్టినది. ఈసారి కూడ ఓటమిని చవిచూచిన దొంగల కెప్టెన్ బ్రిటానియా మీదికి తుపాకీ గుండ్ల వర్షం కురిపించి దానిని నీటిలో ముంచివేయాలనుకొన్నాడు. కాని ఈ ప్రయత్నం కూడ విఫలమయ్యింది. తుపాకీ పేలుళ్ల వలన కలిగిన పొగ దట్టముగా అలుముకున్నందున ఓడలు ఒకదానికొకటి కనిపించకుండాపోయాయి. కొంతసేపటికి బలమైన గాలి వీచి ఆ పొగ మాయమైనది. కాని బ్రిటానియా ఓడ దొంగల ఓడకు చాలా దూరముగా శరవేగంతో దూసుకుపోవడం ఆ దొంగ కెప్టెన్ చూచి ఆశ్చర్యపోయాడు. ఆ దొంగలు కోపముతో మండిపడి చివరికి చేసేదేమి లేక వారి దారిన వారు వెళ్లిపోయారు. ఈ విధముగా దేవుడు ప్రార్థనకు జవాబుగా బ్రిటానియా అను ఓడను రక్షించాడు. మిషనెరీల ప్రార్థన యొక్క విలువను అందరు గ్రహించి ఘనపరిచారు.

5 సం॥లు గడిచాయి. మిషనెరీలు సెంట్ థామస్ ద్వీపములో ముమ్మరముగా దేవుని వాక్యాన్ని బోధిస్తూ ఉన్నారు. అయితే వారు మిగిలిన మిషనెరీలందరు కలిసి దొంగల చేతిలో నుండి పొందిన విడుదలను గూర్చి వార్షికోత్సవం జరుపుకొని దేవుని స్తుతించాలని వారు నిర్ణయించుకొన్నారు. వారు కూర్చొని మాట్లాడుకొనుచుండగా

ఒక అపరిచితుడు వచ్చి వారిని కలుసుకోవాలని కోరుచున్నట్లుగా వారికి వర్తమానమందినది. వారు సమ్మతించగా గంభీరముగానున్న ఒక పొడవైన వ్యక్తి లోనికి ప్రవేశించాడు. మిషనెరీలు ఆశ్చర్యపడి 'మాతో నీకేమి పని?' అన్నారు. మొదట ఒక ప్రశ్నకు సమాధానం చెప్పండి అన్నాడతను. '5 సం॥ల క్రితము ఇంగ్లీషు ఓడయైన బ్రిటానియాలో ఈ దేశానికి వచ్చినవారు మీరేనా?' "మేమే" అన్నాడు ఒక మిషనెరీ. మీరు దొంగల చేత దాడి చేయబడ్డారు కదూ? అక్షరాల అది నిజం. కాని ఈ ప్రశ్నలన్ని ఎందుకు? "మీ మీద దాడి చేసిన ఓడ కెప్టెన్‌ను నేనే గనుక".

ఆ మిషనెరీలు ఒకరి ముఖాలనొకరు చూచుకొని నిశ్చేష్టులైపోయారు. "అద్భుతరీతిగా మీ ఓడ తప్పించబడడమనేది నేను రక్షణ పొందడానికి క్రీస్తునందు విశ్వాసముంచడానికి హేతువయ్యింది" అన్నాడు. తరువాత అతడు తన కథను వివరిస్తూ ఉంటే మిషనెరీలు చెప్పనశ్యమైన సంతోషముతో వినసాగారు.

వింతైన రీతిగా వారు విడుదల పొందడాన్ని అతడు జీర్ణించుకోలేకపోయాడు. అతడు బ్రిటానియా ఓడ కెప్టెన్‌ను కలుసుకొని మొరేవియన్ మిషనెరీల ప్రార్థనను బట్టి తప్పించబడినట్లుగా తెలుసుకున్నాడు. ఒక ఓడ దొంగలచేతిలో నుండి ప్రార్థన ద్వారా ఎలా కాపాడబడగలుగుతుంది! అనేది ఆయనకు అర్థం కాని ప్రశ్న. మొరేవియన్ సహోదరులను కలుసుకోవడానికి నిశ్చయించుకున్నాడు. అతడు తన ఓడను అమ్మివేసి అమెరికాలో ఒక ప్రసంగం విన్నాడు. "భయముతోను, వణకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుడి" అన్న వాక్యము మీద ప్రసంగం చేయబడినది. తరువాత అతడు ఆ బోధకుని కలుసుకొని రక్షణ మార్గమును గూర్చి తెలుసుకొని తన పాపములను గూర్చి పశ్చాత్తాపపడి వాటిని ఒప్పుకొని పాపము నుండి విడుదలపొంది రక్షింపబడినారు.

"నేను మొదట దొంగల నాయకుడిని, ఇప్పుడైతే ఒక బీద పాపిని. యేసుక్రీస్తు యొక్క కరుణా వాత్సల్యతనుబట్టి నేనిప్పుడు నీతిమంతునిగా తీర్చబడ్డాను. ఒక దినమున మిమ్మును కలుసుకొని నా అద్భుత సాక్ష్యమును చెప్పాలనేదే నా ప్రధాన ఉద్దేశముగా నుండినది. అది ఈ దినమున నెరవేరినది అన్నాడు ఆ క్రొత్త వ్యక్తి.

మిషనెరీల హావభావాలు ఎలా ఉంటాయో మనమూహించుకొనవచ్చును. వారి ప్రార్థన ద్వారా వారు విడిపింపబడడమే గాక ఆ ప్రార్థనద్వారానే దొంగల కెప్టెన్ సాతాను బంధకాల నుండి విడుదల పొంది దేవుని రాజ్యంలోనికి రావడాన్ని బట్టి వారందరు కలిసి మోకరించి దేవుని యొక్క కృపాబాహుళ్యమునుబట్టి ఆయనను ఎంతగానో స్తుతించారు.

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2022-24

## 2024 - మే
## సువార్త ఉజ్జీవ సభలు

| | |
|---|---|
| **14,15** | **కొల్లూరు**<br>దోనేపూడి రోడ్ |
| **16,17,18** | **పామర్రు**<br>గుడివాడ రోడ్,<br>పెట్రోల్ బంకు దగ్గర |
| **20,21,22** | **ఆర్మూర్**<br>జీసెస్ పెంతెకోస్తు ప్రార్థన<br>మందిర ఆవరణములో<br>హైదరాబాద్ హైవే ప్రక్కన<br>బ్రాహ్మణపల్లి × రోడ్ దగ్గర |
| **23,24,25** | **సత్తుపల్లి**<br>JVR డిగ్రీ కాలేజి గ్రౌండ్ |
| **26,27,28** | **వినుకొండ**<br>NSP కాలని గ్రౌండ్స్ |

**2024-జూన్**

| | |
|---|---|
| **13,14,15** | **తుని**<br>రాజా హైస్కూల్ గ్రౌండ్ |

To,
Sri / Smt.

If undelivered please return to :

**Bro. DEEVANAIAH,** Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : +91 7893823893

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 4th & 5th of Every Month